# కళాపోషణ

శ్రీ ధరణికోట శ్రీరాం

"నరసింహారావుగారు! యీదినం తమపాత్ర నిర్వహణం మహా అద్భుతంగావుంది. మీబోటి నటకులుండబట్టే యింకా నాటకరంగం సజీవంగావుంది. లేకపోతే యీసరికి సినీమాలదాడితో నాటక కళ పూర్తిగా అంతరించేదే."

నిజంగా నరసింహారావు కళోపాసకుడు. జీవరహితంగా, గ్రంథాల అట్టలమధ్య తలదాచుకొని వున్న పాత్రలకు ప్రాణంపోసి అద్భుతవ్యక్తులుగా తయారుచేసే చాకచక్యం వున్నదాయనకు. ఆ దినం ధరించింది నలపాత్ర. వేలవర్షాలక్రిందట రాజ్యాన్ని, భార్యను, సంపదను, సౌఖ్యాన్ని పోగొట్టుకొని కలిదేవత పైశాచకనృత్య సంరంభ భయంకర పాదాలక్రింది నలిగి, కలిగి, వికృతరూపంతో, చివరకి కాలవైపరీత్యానో, కవి చాతుర్యంచేతనో తన పూర్వసామ్రాజ్య వైభవాన్ని, యిల్లాలి ఆలింగనా సౌఖ్యాన్ని పొందిన నలచక్రవర్తి నిజంగా తల్లికడుపున వుద్భవించి భూముఖంచూచాడో, లేక కవి వూహాప్రపంచంలోనే పుట్టి, పెరిగి, పెద్దయై, ఆ మహాసామ్రాజ్యంలోనే అంతరించాడో మనకు తెలీదు. కాని నరసింహారావు ఆ చక్రవర్తి వేషాన్నిధరించి రంగంలో అడుగుపెట్టాడంటే మాత్రం, సజీవ నిషధేశ్వరుడు, తన పూర్వ సుఖదుఃఖాతిశయాలతో ప్రేక్షకుల ముందగిపించేవాడు. దమయంతి ప్రేమబంధాల్లో ఆయన్ని కీలించి, లాలిస్తుంటే అందరి మనస్సు పులకరించేది. అడవుల్లో క్షుద్బాధకు కుమిలిపోతూ, శనిప్రేరితంతో భార్య అర్ధవసనాన్ని సంగ్రహించి, యిల్లాలిని, వనవృక్షాలకు, భయంకర జంతుజాలానికి, సూర్యచంద్రాదులకు అప్పగించి, విచ్ఛిన్నమైపోతుండే హృదయాన్ని రెండుచేతుల బిగియపట్టుకొని ఒక్కపరుగున భార్య పొంతనుండి పరిగెత్తిన సమయంలో చూచే వారిహృదయాలు, కరిగి కండ్లలోంచి ధారాపాతంగా ప్రవహించేవి.

"తమ ప్రశంసకు నా నమస్కారాలు. నేను నిజంగా ప్రశంసార్హుణ్ణి గానేమో" నన్నాడు. నరసింహారావు జమీందారుగా రందిచ్చిన చేతి నందుకుంటూ.

ఆయన తరువాత ప్రేక్షకులలోనుండిన అధికారులు, యితర పురప్రముఖులు నరసింహంచుట్టూ మూగారు. ఒక ఉత్సాహపురుషుడు, దమయంతి స్వయంవర సమయంలో వుపయోగించిన పుష్పమాలను తెచ్చి, నరసింహం మెడలో వేశాడు. అందరు కరతాళాలు మ్రోగించారు.

ఆ గుంపును త్రోసుకొని ఒకచిన్నపిల్లాడు నరసింహంవైపు పోయినాడు. వాడికండ్లలోంచి కన్నీళ్లు కారుతున్నై—పెదవు లదురుతున్నాయి. "బాబాయ్! అమ్మకు చాలా కష్టంగావుంది. శాస్త్రుర్లుగారు నిన్ను పిలుచుకొని రమ్మన్నారు." అన్నాడు గోపాలు డాయన మొఖంవైపు చూస్తూ.

♦ ♦ ♦ ♦

మూడుదినాలనుంచి పద్మావతమ్మకు సరిగాలేదు. ఎప్పుడూవచ్చే జ్వరంలాంటిదే కదా అని మొదటి రెండుదినాలు గంజిపత్యంతో యింట్లోవుండే జ్వరంమాత్రలు వాడారు. ప్రయోజనం లేకపోయింది. మూడో రోజుంవుదయం నూటనాలుగు డిగ్రీలవరకు పొంగింది జ్వరం. చిరపరిచితులైన నారాయణ శాస్త్రుర్లుగారిని పిలుచుకొనివచ్చి చూపించాడు నరసింహం.

"అయ్యో! నాయనా! మొన్ననే నాకు కబురంపకూడదటోయ్. వ్యాధి ముదిరిన లక్షణాలు కనపడుతున్నా"యన్నారు శాస్త్రిగారు. నరసింహం హృదయంలో ఒక్కపిడుగు పడినట్లైంది. భార్య వైపుచూచి 'పద్మా' అని పిలిచాడు. ఆమె పెదిమెలు కదపలేకపోయింది. గుండ్రని ఆమె కన్నులనిండా కన్నీళ్లు తిరిగాయి. మంచానానుకొని తనవైపుచూస్తున్న గోపాలుడివైపుచూచి మరల నరసింహంవైపు చూచింది. అర్థంగ్రహించి నరసింహం మొహానికి గుడ్డ అడ్డంపెట్టుకొని బుడబుడ దుఃఖించాడు.

"దుఃఖిస్తే అవుతుందా నాయనా! అమ్మాయికేమి ఫరవాలేదు. నీవిలా కన్నీళ్లు కారుస్తుంటే రోగికి గుండె చెదిరిపోదూ! గోపాలు చూడూ యెంత బెంగపోయినాడో!" అన్నారు శాస్త్రిగారు.

నరసింహం "శాస్త్రులుగారు! పద్మకు జ్వరం నెమ్మదిస్తుందా? నా సర్వస్వాన్ని మీ చేతుల్లో వుంచుతున్నాను. పద్మను మరల అనుగ్రహించాలి నాకు" అన్నాడు.

సాయంకాలానికి జ్వరతీక్షణ కొంచెం తగ్గింది. రోగి నిద్రపోతోంది. శాస్త్రిగారిక ఫరవాలేదన్నారు. ఆరున్నరకు ఒక పిల్లవాడు సుబ్బారావుగారి దగ్గరనుంచి ఒకచీటి తెచ్చిచ్చాడు నరసింహానికి. అంతవరకు ఆనాటినాటకం విషయమే మరిచిపోయినాడు యిల్లాలి బెంగలోపడి. ఈ పరిస్థితుల్లో యేం చేయాలో తెలిసిందిగాదు. ముక్కుమీదికి వచ్చివుండే భార్యను విడిచిపెట్టి వెళ్లడమా? లేక తనకు సర్వస్వమూ అయిన కళాదేవి ఆరాధనను విసర్జించడమా?

పద్మను హృదయపూర్వకంగా ప్రేమించి వివాహం చేసుకున్నాడు. తొలుత ఆమె మురిపాలు గురిపిస్తుండే రూపానికి లొంగిపోయాడు. సంసారంలో ప్రవేశించి, అనంత్యమైన ఆమె కోమల మనోద్యానంలో, సుగంధాలీనుతుండే పుష్పాల నేరుకుంటూ ముగ్ధుడైపోయినాడు. తన్ను కాల్చేయాలని ప్రయత్నించే సంఘాన్ని క్షమించాడు, ఆ సౌఖ్యపు మత్తులో.

పిత్రార్జితమంతా క్షీణించి, సంపాదన సంకుచితమై, కడుపునిండటమే మహా కష్టంగావుండే ఆ కాలంలో తనపద్మను, పద్మా ప్రసాదుడైన గోపాలుణ్ణి చూచుకుంటూ కాలక్షేపం చేశాడు. తనకు పద్మను మించినవారెవరున్నారీ ప్రపంచంలో!

అయితే కళాదేవి? చిన్ననాటినుంచి తానాదేవతారాధన యేమరకుండా చేస్తున్నాడు. పద్మ బాహుబంధనా సౌఖ్యమెరుగకముందే యీ కళాదేవి మాతృప్రేమను రుచిచూచాడు. తొలినాడే తన జీవిత సర్వస్వాన్ని ఆమె పాదాలముందర నైవేద్యం చేశాడు. ఆదేవి దీవనాఫలితమే పద్మ, గోపాలురని నమ్మాడు. వారి పోషణలో ఆమెకుమాత్రం బాధ్యతలేదు.

నరసింహం మనస్సును ధృఢం చేసుకున్నాడు. కళారాధన నిలువదు......

◆ ◆ ◆ ◆

నరసింహం, గోపాలుడితోగూడ యింటికొచ్చేసరికి పద్మావతమ్మ పరిస్థితి చాలా క్లిష్టంగానే వుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బహు కష్టంగా జరుగుతున్నాయి. శాస్త్రిగారు పడకప్రక్కనే కుర్చీమీద కూర్చొనున్నారు. తనతల్లి, మంచంప్రక్కన మందులునూరుతూ కూర్చొని, నరసింహాన్ని చూడగానే గొల్లుమని యేడ్చింది. పద్మ కన్నులు తెరిచింది. గోపాలుడు పెద్దపెట్టున 'అమ్మా' అని యేడ్చాడు. మంచంలో కూర్చొని పద్మ కండ్లనుండి కారుతుండే ఉష్ణభాష్పాలను తుడిచాడు నరసింహం. కాళ్లుచేతులు పట్టుకొని

చూచాడు. మంచుగడ్డకు మల్లే చల్లగావుందిదేహం. దీపం ఆరిపోతున్నదని గ్రహించాడు. 'పద్మా! పద్మా!' అని దీనంగా పిలిచాడు. కన్నులుతెరిచి గోపాలుణ్ణి ప్రక్కన కూర్చోపెట్టమని సంజ్ఞచేసింది, మహాప్రయాసతో. గోపాలుడి చేయిపట్టుకొని, నరసింహంచేతిలోపెట్టి కన్నీరు కార్చింది. ఆ దుఃఖాశ్రువుల్లోంచి మొలక నవ్వొకటి కనిపించింది. స్వర్గద్వారం ఆమెదృష్టి కందిందేమో! అంతటితో స్మృతిదప్పి కండ్లు మూసింది. అందరూ గొల్లుమన్నారు. సూర్యోదయం కావస్తున్నది. సూర్యదర్శనంతో పద్మ తొడిమను వీడి, రాలిపోతుందా?

శాస్త్రుల్లుగారు చేయిచూచి యేడువ వద్దన్నారు. ఇంకా అంతా పూర్తికాలేదు.

“నరసింహం! నాచేత నైనమట్టుకు పద్మకు చికిత్సలుచేశాను. ఇంక నీ అదృష్టం. జిల్లా డాక్టరుగారు చాలా తెలివిగలవారంటారు. ఒకమా రెలాగైనా ఆయన్ను పిలుచుకొనొచ్చావంటే, నీ అదృష్టం, గోపాలుడి నుదుటిరేఖ బాగుంటే, యిప్పటికి ఆయనకు మించిపోదనుకుంటాను.”

పెద్ద డాక్టరును పిలుచుకొని రావాలని నరసింహం అంతకు ముందటిదినమే అనుకున్నాడు. కాని ఆయన వూరకనే వస్తాడా. ఆయన ఫీజ కివ్వాలనినడబ్బు! మందుఖర్చులు!! తన్ను ప్రశంసిస్తుండే ధనాఢ్యులు, తనకేలాంటి సహాయముచేయరని అతనికి పూర్వానుభవంవల్ల చక్కగాతెలుసు. తన జీవితాన్ని ధార పోసి పద్మప్రాణాన్ని దక్కించుకోటానికి నరసింహం సంకోచించడు. అయితే పైక మేలా సంపాదించ గలడు. దేవుడికృప చల్లగావుంటే పద్మ కులాసాగా వుండకపోతుందా అనుకున్నాడు. శాస్త్రిగారిసలహా మాటల అవే వూహలను రేపాయి. గట్టిప్రయత్నం చేయాలని నిర్ధారణచేసుకొని ప్రక్కనుండే తుండుగుడ్డ మీద వేసుకుని బైలుదేరాడు.

అప్పుడప్పుడే జనసంచారం సాగుతూవుంది. బాణంలాగ రివ్వుమని ఒకమోటారు అతనిప్రక్క నుంచే పోయింది. దానిలో యెవరో ఆడవాళ్లు కిలకిల నవ్వుతూ కూర్చున్నారు. మోటారు వెంటనే లేచిన దుమ్ము నరసింహం ముఖంనిండా కప్పేసింది. పక్షులు నూతనోత్సాహంతో పరుగులు వారుతున్నాయి. ప్రక్కనేవుండే మంగలివీధినుంచి; సన్నాయి మనోహరంగా వాయిస్తున్నాడో సాధకుడు.

పాండురంగంగారి బంగళా మైలుదూరంలో వుంది. వకీలుగారప్పుడే పండ్లుతోముకుంటూ తోటలో కూర్చొని తోటమాలి భార్యకేవో కబుర్లు చెబుతూ నవ్విస్తూ తనూ నవ్వుతూన్నారు. నరసింహాన్ని చూచి మరోకుర్చీ తెప్పించే మిషతో దాన్ని తరిమేశారు.

'ఏమోయ్! నరసింహం! అలావున్నావు. రాత్రి రావటానికి వీల్లేకపోయింది. సుబ్బారావుగారు డోనార్సు టిక్కెట్టు పంపించారుకూడాను! (నిజంలో ఆ టిక్కెట్టునిచ్చి కొడుకును పంపించారు నాటకానికి) ఏలావుంది నాటకం?'

నాటకవిషయం రెండుముక్కల్లో చెప్పి, తను వచ్చినపని చెప్పాడు నరసింహం. డబ్బుమాట ప్రస్తావన రాగానే పాండురంగంగారి వైఖరి మారింది.

'క్షమించాలి, నరసింహం. ఈదినం వుదయం మావాడు గుంటూరు పోతున్నాడు. పరీక్షకు పైకం చెల్లించాలట. వాడి చదువుతో నా సంసారమంతా గుల్ల అయ్యేలాగుంది. ఈ కష్టకాలంలో అప్పు......'

ఇహ వుపయోగంలేదనుకొని నరసింహం లేచిపోయినాడు.

◆ ◆ ◆ ◆

'జమీందారుగారు, యింట్లో లేరని చెప్పమన్నారు. నన్నేంచేయమంటారు నరసింహంగారు, యీయనమూలాన్ని ప్రొద్దున లేచినప్పటినుంచి యింటికిపోయేంతవఱకు అబద్దాలు చెప్పాలిసొస్తున్నది.'

'పైకమా! గవర్నమెంటు నౌకరి చేసే మాబోటివాండ్లదగ్గిర రెండవతేది తెల్లవారేటప్పటికి రూక వుండదని తెలియదటోయ్!'

◆ ◆ ◆ ◆

'అదుగో! అక్కడ నిలుచోనున్నాడే ఆయనే నరసింహారావు. ఈ సమయం తప్పితే మరి మనకు దొరకడాయన. వెంటనే పట్టుకోవాలె' నన్నాడు బంగారుశెట్టి, అమీనాగారి కోటులాగి, ఆయన భుజం మీదుగా నరసింహంవైపు చూపిస్తూ.

'మీరేనాండి నరసింహారావుగారు. మీరు బంగారుశెట్టికివ్వాలిసిన ఆరునూర్ల ముప్పై ఐదు రూపాయల ఆరణాలకు మిమ్మలిని అరెస్టుచేస్తున్నాను. ఇదుగో యిక్కడ కొంచెం సంతకం చేయండి.'

'అరెస్టా? నన్నా? బంగారుశెట్టిగారు! నా భార్యకు చాలా జబ్బుగావుంది. ఈదినం నన్ను క్షమించారంటే...'

'నీబోటివాండ్లను చాలామందిని చూచాను. ఇంతకాలంనుంచికూడా, యేదో పెద్దమనిషివికదా అనుకున్నాను. అమీనాగారు! మీపని మీరు చేయండి.'

◆ ◆ ◆ ◆

జైలు గడియారం తొమ్మిది కొట్టింది. దేహస్మృతిలేని నరసింహారావును లోపలవేసి యినుప తలుపులు బిగించారు.

సాయంకాలం నాలుగుగంటలు. జైలు బైట కుక్కలు మొరిగిన శబ్దం. నరసింహానికి స్మృతివచ్చింది వున్నట్లుండి. యెవరో వెక్కి వెక్కి యేడుస్తున్నారు. కండ్లుతెరిచి చూచాడు గోపాలుడు తలుపుకమ్మలను పట్టుకొని రాళ్ల మెట్టుమీద కూర్చొని తనకేసి చూస్తూ యేడుస్తున్నారు. నరసింహం లేచి కూర్చొని, తలుపు కమ్మల సందునుంచి గోపాలుణ్ణి తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'బా...బా...య్! అమ్మను ఎ...త్తి...కెళ్లారు. నీ...వు యిం...టికి...రావూ?' అన్నాడు వెక్కి వెక్కి యేడుస్తూ గోపాలు.

'ఆ! పద్మనా! గోపాలూ మీ అ...మ్మ...ను ప...ద్మా! ప...ద్మా!!.'

ఈ పాపభూయిష్టమైన ప్రపంచంలో నరసింహం ఉచ్చరించిన తుదిశబ్దాలవి. ఉదయాన్నుంచి క్షణక్షణం బిగుసుకుంటూవుండే అతని హృదయతంత్రులు వొక్కపెట్టున పెళ్లుమని తెగిపోయినాయి. కొట్టిన ప్రానట్లే విరగబడ్డాడు. మరుక్షణమే, గోపాలుడు అనాధశిశువైనాడు. మాంసాన్ని కొరుక్కుతినే నరహంతకులతో నిండిన ప్రపంచముందు, ముక్కుపచ్చలారని గోపాలుడున్నాడు!

◆ ◆ ◆ ◆

మరుసటిదినం పత్రికల్లో యీలా ప్రకటించారు. 'ఆంధ్రనటచక్రవర్తి నరసింహారావుగారు నిర్యాణమందారు. ఆంధ్రనాటకరంగానికి నూతనశోభతెచ్చిన మేటి. చిన్ననాడే నాటకరంగంలో ప్రవేశించి, తన జీవితాన్ని, తన ప్రేయసి జీవితాన్ని, యీ దేవీపీఠంముందర బలియిచ్చిన త్యాగి. యెనిమిదేండ్ల కుమారుణ్ణి మాత్రం ప్రపంచానికప్పచెప్పి ప్రపంచనాటకరంగంనుంచి నిష్క్రమించారు! ఆ దంపతుల ఆత్మకు శాంతి గలుగుగాక! తల్లిదండ్రులులేని అనాధశిశువును దైవము పోషించుగాక.'

◆ ◆ ◆ ◆

ఆంధ్రలోకం, నరసింహం చేసిన సేవకు తగిన సత్కారం చేశాముగదా అని చిరునవ్వు నవ్వి, ఆ కళారాధకుణ్ణి మరిచిపోయింది——